క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

పెద్దకొత్తపల్లి: సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపీడీఓ నాగేందర్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

మేకల పంపిణీ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి చెంచుగూడెంలోని 17 కుటుంబాలకు హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి అక్బర్ శనివారం మేకలను పంపిణీ చేశారు. చెంచుల జీవనోపాధి కోసం ఒక్కో కుటుంబానికి నాలుగు మేకలను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చెంచు సంఘం నాయకులు బర్మల మల్లయ్య, దేవమ్మ, రాజశేఖర్, పెద్ద కురుమయ్య, ఐలేని అశోక్, పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు వినతి



కొల్లాపూర్: పట్టణానికి చెందిన గాయత్రీ ఎడ్యుకేషన్స్ చైర్మన్, ప్రైవేటు కళాశాలల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురగాని శ్రీనివాస్‌గౌడ్ శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌లను కలిశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీరీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

నర్సరీల పరిశీలన



తాడూరు: మండల కేంద్రంతోపాటు చర్లిటికాల, తిరుమలాపురం గ్రామాల్లోని వన నర్సరీలను ఈజీఎస్ ఏపీఓ చంద్రసిద్దార్థ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. నర్సరీ నిర్వహణ, మొక్కల సంరక్షణ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నర్సరీలలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతి రోజు నీటిని అందించి మొక్కలను రక్షించాలన్నారు. అదేవిధంగా ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని కోరారు.

ముగిసిన కంటి వైద్య పరీక్షలు



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం ముగిసింది. వారం రోజులుగా చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వైద్య బృందం సమక్షంలో రెండు వేల మంది వరకు స్క్రీనింగ్ టెస్టులు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇప్పటికి 100కు పైగా శస్త్ర చికిత్సలు చేశామన్నారు. మరో 75 మంది చెన్నైలోని శంకర నేత్రాలయ కంటి ఆస్పత్రిలో కంటి చికిత్సలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దైవచింతనతో ప్రశాంతత



అయ్యవారిపల్లి ఆలయంలో లక్ష్మీనరసింహా స్వామి



రామాజిపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాయకులు

బల్మూర్: దైవచింతనతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని రామాజిపల్లిలో శనివారం భక్తాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. గ్రామంలో పండుగ సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మోహన్‌రెడ్డి, బండపల్లి వెంకటయ్య, మాధనాచారి, నిరంజన్, సురేందర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, ఆవుల తిరుపతయ్య, సుధాకర్‌గౌడ్, అనంతరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుపతిరావు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని గుండాలలో శనివారం ఆలయంలో వృషభవాహనసేవ, హంసవాసన సేవ, కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

రేపు లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో ఈనెల 18న సోమవారం లక్ష్మీనరసింహ స్వామి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్‌రెడ్డి యాదిరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈ నెల 18న ఉదయం 6.03 గంటలకు ఆంజనేయ స్వామికి అభిషేకం, అర్చనలు, దూపదీప నైవేద్యం అనంతరం 8 గంటలకు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 9.31 గంటలకు పుణ్యాహవాచన, నవగ్రహ పూజ, సుదర్శన హోమం, ఉదయం 11.34 గంటలకు లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ ఊరేగింపు ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో యాదవుల ఆరాధ్య దైవం పెద్దమ్మ అమ్మవారి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో మొదటి రోజు పుట్టను కప్పివేసే కార్యక్రమం, దేవతామూర్తుల విగ్రహాల శుద్ధి నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు బాల్ నారాయణయాదవ్ తెలిపారు. ఆదివారం రెండో రోజు తట్టల కార్యక్రమం, సోమవారం ఉదయం మూడో రోజు పెద్దమ్మ అమ్మవారి కల్యాణోత్సవం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రాములు యాదవ్, బుగ్గయ్యయాదవ్, తిర్పతయ్య యాదవ్, శ్రీను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో త్రిపుటవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు రథాన్ని లాగారు. గ్రామాల్లో పండుగ వాతావరణం తలపించింది. రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శేషిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్యగౌడ్, నరేష్‌గౌడ్ తదితరులు భక్తులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడిని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి గోత్రనామార్చన, హారతి, శనిదోషనివారణ మంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు అనంతరం భక్తులు శివాలయంలో శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్: వాల్మీకీ బోయలకు ఫెడరేషన్ ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని శనివారం పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావును ఆ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి జూపల్లి స్పందించి వెంటనే ఆ శాఖకు సంబంధించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేసి వాల్మీకీ బోయలకు ఫెడరేషన్ ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకీ బోయల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పరశురామ్‌నాయుడు, నాయకులు కొండూరు గోపాల్, ఎల్ఐసీ సత్యం, కృష్ణ, కల్వరాల నర్సింహ్మా, సింగోటం గోపాల్, అశోక్ తదితరులున్నారు.

విద్యాహక్కు చట్టం అమలుచేయాలి

2009 విద్యాహక్కు చట్టాన్ని అమలుచేయాలని కోరుతూ తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి విన్నవించారు. కార్యక్రమంలో దళిత దండు నాయకులు బాలరాజు తదితరులున్నారు.

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర వాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో విద్య హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు అన్నారు. శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో దళిత దండు నాయకులు మల్లేల వెంకటస్వామి తెలంగాణ మాదిగ దండోరా నాయకులు మీసాల రాముడు, నరసింహ్మా తదితరులు ఉన్నారు.



కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకీ బోయలు

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు కల్వకుర్తి ప్రాంతం నుంచి బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీటీసీ నర్సిరెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, కృష్ణగౌడ్, సురేందర్‌గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

లింగాల: విజయ సంకల్ప సభకు మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో సభకు బయలుదేరి వెళ్లారు.



కల్వకుర్తి నుంచి బయలుదేరుతున్న నాయకులు, మహిళలు

ఇన్విజిలేటర్లకు అవగాహన

లింగాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో శనివారం సీఎస్‌లు రాంసింగ్, నరేందర్‌రెడ్డి పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో లింగాల, అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలలు, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన మొత్తం 279 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. లింగాల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 111, సాంఘ/క సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 168 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఎస్‌లు తెలిపారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అవకాశవాది

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అవకాశవాది అని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ అన్నారు. శనివారం స్థానిక పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి కొందరు నాయకులు వ్యక్తిగత స్వార్ధ రాజకీయాల కోసం బహుజనవాదం ముసుగులో వచ్చి బహుజనవాదాన్ని తాకట్టు పెట్టి పదవులు అనుభవించాలని చూస్తున్నారని ఆరోపించారు. బీఎంపీ ద్వారానే రాజ్యాధికారం సాధ్యం అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎంపీ అభ్యర్థిగా ఉంటానని పేర్కొన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

మహిళ అదృశ్యం

బల్మూర్: మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జాలం పర్వతాలు, పద్మ దంపతులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. 12 ఏళ్ల కూతురు దివ్యాంగురాలు శ్రీశైలం వద్ద ఉన్న దోర్నాలలో వసతి గృహంలో చదువుతోంది. పింఛన్ రెన్యూవల్ కోసం తల్లి పద్మ గత నెల 28న హైదరాబాద్ నుంచి స్వగ్రామం లక్ష్మీపల్లికి వచ్చింది. పని పూర్తైన తర్వాత ఈనెల 13న దోర్నాలకు వెళ్లింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఆమె భర్త ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

పరీక్షలపై భయాందోళన వద్దు



వెల్దండ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జేడీ వెంకటనర్సమ్మ

వెల్దండ: పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ జేడీ వెంకట నర్సమ్మ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలన్నారు. మోడల్ స్కూల్‌లో 220 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 160 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



తాడూరు కేజీబీవీలో..

పరీక్షలపై భయాందోళన వద్దు

తాడూరు: పరీక్షలపై భయాందోళన చెందొద్దని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాయాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులు హాల్ టికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓ విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానంలో స్థిరపడాలి



తెలకపల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ పాఠశాల ఒకటో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతోపాటు క్రమశిక్షణ, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సింగిల్‌విండో వైస్ చైర్మన్ యాదయ్య, గుగ్గిళ్ల ప్రకాష్, బాలగౌడ్, పాఠశాల యాజమాన్యం, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవలను విస్తరించాలి



కల్వకుర్తి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపటడుతున్న సేవలను విస్తరించాలని లయన్స్ డిస్ట్రిక్ రెండో గవర్నర్ క్యాండెట్ సురేష్‌జజ్జాని అన్నారు. శనివారం కల్వకుర్తి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబుతోపాటు క్లబ్ అధక్షుడు రమేష్, కార్యదర్శి శ్రీధర్, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ కిషన్‌లను సత్కరించి మెమోంటాలను బహూకరించారు. క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, మాజీ గవర్నర్ రమేష్‌బాబు, జాన్సన్, పూనమ్‌జైన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికం

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బాలరాజు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడీ అడ్డుపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అరెస్టులు తమకు కొత్త కాదని, ఉద్యమంలో ఎన్నో కుట్రలను ఎదుర్కొని నిలిచామన్నారు. కవిత అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ, కాంగ్రెస్ కలిసి కుట్ర పన్నాయన్నారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేష్‌రావు, నాయకులు శంకర్, సురేష్, గౌస్, శ్రీను పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట, బిజినేపల్లి మండలాల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులను ఆయా మండల పోలీసులు అరెస్టులు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో నిరసనలు చేపట్టాలని పార్టీ పిలుపునిచ్చింది. ముందస్తుగా నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐలు నరేందర్‌రెడ్డి, నాగశేఖర్‌రెడ్డిలు తెలిపారు.

కొల్లాపూర్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు కేంద్ర ప్రభుత్వ పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగం నాయకులు దేవని కుమార్ మాదిగ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నేతలు రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని, అందులో భాగంగానే కవితను అరెస్టు చేశారన్నారు. నాయకులు శీలం వెంకటేష్, మైనోద్దీన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న నర్సింహగౌడ్



కల్వకుర్తిలో..

కల్వకుర్తిరూరల్: భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండిస్తూ శనివారం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్ చౌరస్తా నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుటిల రాజకీయాలతో అరెస్ట్ చేశారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, దశరథ్‌నాయక్, పత్యానాయక్, తలసాని జనార్దన్ రెడ్డి, వైస్ ఎంపీపీ గోవర్ధన్, విజయ్‌గౌడ్, పావని, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి క్లాస్‌మేట్ క్లబ్ చేయూత



కల్వకుర్తిరూరల్: ఉన్నత స్థాయి విద్యను అభ్యసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థి లలితకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు రాఘవేందర్, సౌజన్యంతో దాతల సహకారంతో ఆర్థిక సహాయాన్ని క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శోభన్‌బాబు, శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



చారకొండ: మండల కేంద్రంలో ఆర్యవైశ్య, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, వాసవీ క్లబ్ ప్రసిడెంట్ కరుణాకర్, కార్యదర్శి కరుణాకర్, రవి, సభ్యులు రమేష్, కృష్ణయ్య, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థిని లోబర్చుకున్న విద్యార్థి సంఘం నాయకుడు

అచ్చంపేట రూరల్: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఓ నాయకుడు ఓ మైనర్ విద్యార్థిని పట్ల దుర్బుద్ధి ప్రదర్శించాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థి సంఘం నాయకుడిని చితకబాదిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినితో విద్యార్థి సంఘం నాయకుడు పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు హెచ్చరించినా తీరు మార్చుకోలేదు. ఇటీవల ఇంటర్ పరీక్షల సమయంలోనూ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిసి తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థి సంఘం నాయకుడికి దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా విద్యార్థి సంఘం, అనుబంధ సంఘాల నాయకులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం ఆ విద్యార్థి సంఘం నాయకుడు సంఘంలో పనిచేయడం లేదని అనుబంధ సంఘం నాయకులు చెబుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ రామును వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మన్ననూర్: నల్లమల లోతట్టు ప్రాంతం కొమ్మెన్ పెంటలోని చెంచులకు శంషాబాద్‌కు చెందిన రైతు రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి సామాజిక బాధ్యత టీమ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. కొంత కాలంగా ప్రతి ఏట చెంచులతో ఒక రోజు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు తొమ్మిది సార్లు చెంచు పెంటల్లో పర్యటించి వారికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి 25 కేజీల బియ్యంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. మహిళలు, పురుషులు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కరుణాకర్‌రెడ్డి

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం



బాండ్లను పంపిణీ చేస్తున్న శ్రీధర్‌బాబు

పెద్దకొత్తపల్లి: ఉపాధ్యాయుల సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యమని యూటీఎప్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాఎం శ్రీధర్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సంక్షేమ నిధి పథకంలో చేరిన ఉపాధ్యాయులకు బాండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కుటుంబాల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ నిధి పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ పథకంలో చేరిన ఉపాధ్యాయులు ఇప్పటి వరకు 17 మంది మరణించారని బాధిత కుటుంబసభ్యులకు రూ.6 లక్షల చొప్పున అందజేశామన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్ చిన్నయ్య, జిల్లా కార్యదర్శి మహేష్‌బాబు, కమిటీ సభ్యులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తైబజారు వేలం రూ.12.30 లక్షలు

కొల్లాపూర్: పట్టణంలో తైబజారు వేలం పాటను శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్ సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో ఐదుగురు పాల్గొన్నారు. చాంద్‌పాషా తైబజారును రూ.12.30 లక్షలకు దక్కించుకున్నారు.